ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 85
సోమవారం 6 అక్టోబర్ 2025
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## పాక్ పనిపట్టిన భారత మహిళల జట్టు




07

## జూబ్లీహిల్స్‌కు నలుగురి పేర్లు!

ప్రతిపాదించిన ఇన్‌చార్జి మంత్రులు
జాబితాను 3 పేర్లకు కుదించే అవకాశం
ఉప ఎన్నిక ప్రచారంపై మీనాక్షి, మహేశ్‌గౌడ్ సమీక్ష



**రోమింగ్ న్యూస్, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి నలుగురు నేతల పేర్లను ఇన్‌చార్జి మంత్రులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలు నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్‌ల పేర్లను వారు ప్రతిపాదించినట్లు సమాచారం. గెలిచే అవకాశం ఉన్న నేతల పేర్లను ప్రతిపాదించాల్సిందిగా

మిగతా 2లో



## వరద బాధితులకు సాయమేదీ?

కామారెడ్డిలో ముఖ్యమంత్రి పర్యటించినా
నయా పైసా సహాయం అందలేదు
కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్
కేంద్రం నుంచి నిధులు తేలేకపోతున్నారు
మాజీ మంత్రి హరీశ్‌రావు

03



# జీవో 9కి పిటిషన్‌పై నేడు విచారణ



బీసీ రిజర్వేషన్లపై తగ్గేది లేదు.. బలంగా వాదించండి
సీనియర్ న్యాయవాదులతో సీఎం రేవంత్‌రెడ్డి
అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ్ దవేలతో ఫోన్‌లో మంతనాలు
ఢిల్లీకి హుటాహుటిన భట్టివిక్రమార్క, పొన్నం, వాకిటి
42 శాతంపై కోర్టుల్లో ప్రతికూల స్పందన వస్తే పార్టీ పరంగా బీసీలకు ఆ మేరకు రిజర్వేషన్లు!

**రోమింగ్ న్యూస్, న్యూఢిల్లీ :** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టుకు చేరింది. బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరులో తీసుకొచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారించనుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ దవేతో ఫోన్‌లో

మిగతా 2 లో



## డార్జిలింగ్‌లో వరుణుడి బీభత్సం

భారీ వర్షాలకు వరదలు, విరిగిపడ్డ కొండచరియలు
వేర్వేరు ప్రాంతాల్లో 20 మంది దుర్మరణం

.. వివరాలు 4లో



## తల్లిని చంపిన కన్నకొడుకు

డబ్బులివ్వలేదని కత్తితో గొంతుకోసిన కొడుకు
గారాబంగా పెంచడమే పాపం
హైదరాబాద్ నుంచి నేరుగా వచ్చి తల్లితో గొడవపడి హత్య
తండ్రి బెడ్‌రూమ్‌లో ఉండగా గడియపెట్టి దారుణం
తర్వాత ఇంట్లోకి వెళ్లి సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ నవ్వులు
పోలియో బాధిత ఉపాధ్యాయురాలి త్యాగాలకు బహుమానం
కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం

.. వివరాలు 4లో

## ప్రాణాలు తీసిన డీజే మోత!

బతుకమ్మ ఆడుతూ నవ వధువు సహా ఇద్దరు మహిళల మృతి
నిర్మల జిల్లాలో విషాద ఘటనలు

.. వివరాలు 2లో



## ఏకకాలంలో 8 కారిడార్లు

వేర్వేరుగా టెండర్లు.. సర్కారు యోచన

వేగంగా 2వ దశ మెట్రో విస్తరణ..
డీపీఆర్‌కు కేంద్రం నుంచి అనుమతి రాగానే అన్ని పనులు షురూ
వచ్చే ఎన్నికల నాటికి చిన్న కారిడార్లను పూర్తిచేసే ప్రయత్నం
కియోలిసతోనే రైళ్ల రాకపోకలు
తగ్గనున్న మెట్రో డిపోలు

**రోమింగ్ న్యూస్, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో మెట్రోరైలు రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో ఉండే అడ్డంకులను వడివడిగా తొలగించుకుని ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తోంది. ఎల్అండ్‌టీ నుంచి మొదటి దశలోని మూడు కారిడార్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా తీసుకునేందుకు ఆ సంస్థతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో రెండో దశ పనులపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు మొత్తం 8 కారిడార్లకు సంబంధించిన నిర్మాణాన్ని ఒకేసారి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎనిమిది కారిడార్లకు సంబంధించి

మిగతా 2 లో

## పలు జిల్లాల్లో జోరు వాన

ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10 సెం.మీ
భూపాలపల్లి జిల్లాలో పిడుగు పడి మహిళ మృతి



04

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం జోరు వాన కురిసింది. ఉమ్మడి కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. జగిత్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత కురిసింది. ఎండపల్లిలో 8.3 సెం.మీ, మల్యాల మండలం మద్దుట్లలో 6.7 సెం.మీ వర్షపాతం నమోదైంది.




03

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నాటకాలు

బీజేపీ పదాధికారుల భేటీలో నిర్ణయం.. ఎంపీలు, ఎమ్మెల్యేలకు జిల్లాల బాధ్యతలు
మనది టీం బీజేపీ: అధ్యక్షుడు రాంచందర్‌రావు.. కలిసి కట్టుగా పనిచేద్దాం: కిషన్‌రెడ్డి
ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
రెండు జిల్లాల అధ్యక్షుల పని తీరుపై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అసహనం

స్థానిక సంస్థలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన అన్యాయాలపై విస్తృత ప్రచారం చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థలకు చేసిన అన్యాయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని మండిపడింది. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేసిన అంశాలతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తీర్మానించింది.

## బిహార్ ఎన్నికలు నవంబరు 22లోపే

04

ఛఠ్ పూజలాగే ఉత్సాహంగా పాల్గొనాలి
ఓటర్లకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పిలుపు
ఎన్నికల సన్నద్ధతపై పట్నాలో సమీక్ష



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 6 అక్టోబర్ 2025







# జూబ్లీహిల్స్‌కు నలుగురి పేర్లు!

మొదటి పేజీ తరువాయి

ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు పేర్లను ప్రతిపాదిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు వారు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ ఆదివారం ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. సీఎం రేవంత్ సూచన మేరకు జరిగిన ఈ భేటీలో ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణతోపాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రతిపాదించిన నాలుగు పేర్ల పైనా ప్రాథమికంగా చర్చించారు. దీనిపై సోమవారం లేదా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, మంత్రి ఉత్తమ్ సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. సర్వేలు, నివేదికల ఆధారంగా ఆశావహుల జాబితాను షార్ట్‌లిస్ట్ చేసి మూడు పేర్లతో అధిష్ఠానానికి ప్రతిపాదన పంపనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్న తీరుపై మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ ఆదివారం ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల, డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎన్నికల ప్రచారం వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా పార్టీ, సిద్ధాంతం కేంద్రీకృతంగా సాగాలని మహేశ్‌గౌడ్, మీనాక్షి సూచించారు. అభ్యర్థిని సర్వేల ఆధారంగా అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రాణాలు తీసిన డీజే మోత!

## బతుకమ్మ ఆడుతూ నవ వధువు సహా ఇద్దరు మహిళల మృతి

## నిర్మల జిల్లాలో విషాద ఘటనలు

**నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో తీవ్ర విషాదం జరిగింది. డీజే సౌండ్ బాక్సుల మోత మధ్య బతుకమ్మ ఆడుతూ ఓ నవవధువు సహా ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగిన వేడుకల్లో డీజే సౌండ్‌తో బతుకమ్మ పాటలు పెట్టుకుని మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ క్రమంలో బిట్లింగు భాగ్యలక్ష్మి(56) అనే మహిళ బతుకమ్మ ఆడుతుండగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మరణించినట్టు స్థానికులు తెలిపారు. అలాగే భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో జరిగిన ఘటనలో ఐదు నెలల క్రితమే పెళ్లి చేసుకున్న రుషిత(22) అనే నవవధువు ప్రాణాలు కోల్పోయింది. శనివారం రాత్రి డీజే సౌండ్‌తో బతుకమ్మ పాటలు పెట్టుకుని బతుకమ్మ ఆడుతుండగా రుషిత అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబీకులు స్థానికంగా చికిత్స అందించి, అనంతరం భైంసాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ చికిత్స అందే లోపే రుషిత ప్రాణాలు విడిచింది.

# పలు జిల్లాల్లో జోరు వాన

## ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10 సెం.మీ

## భూపాలపల్లి జిల్లాలో పిడుగు పడి మహిళ మృతి



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం జోరు వాన కురిసింది. ఉమ్మడి కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. జగిత్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత కురిసింది. ఎండపల్లిలో 8.3 సెం.మీ, మల్యాల మండలం మద్దుట్లలో 6.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. సైదాపూర్ మండలం వెన్కేపల్లి, తిమ్మాపూర్ మండలం రేణికుంటలో 6.4 సెం.మీ. వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వాన దంచి కొట్టింది. సిరిసిల్లలో 6.4 సెం.మీ, కోనరావుపేటలో 6 సెం.మీ వర్షం కురిసింది. పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బషీరాబాద్ మండలంలో 7 సెం.మీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్‌లోని. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో 5.7 సెం.మీ వర్షం కురిసింది. కాగా, పిడుగుపాటుతో మహిళా కూలీ మృతి చెందింది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుమ్మళ్లపల్లికి చెందిన ఇసునం లక్ష్మి(50) పత్తి చేనులో పని చేస్తుండగా పిడుగు పడి మృతి చెందింది. మహాముత్తారం మండలం బోర్లగూడెంలో పిడుగుపాటుకు గురై దుక్కిటెద్దు మృతి చెందింది.

**నేడు, రేపు తేలికపాటి వర్షాలు**

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 10 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# జీవో 9కి పిటిషన్‌పై నేడు విచారణ

మొదటి పేజీ తరువాయి


ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు గడువు, గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లుల పెండింగ్, రాష్ట్ర ప్రభుత్వాలకు జీవో 9ని తీసుకొచ్చే అధికారం తదితర అంశాలపై వారితో అరగంటకు పైగా చర్చించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఇందులో రాజీపడే ప్రసక్తేలేదని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తామని, ఆ దిశగా ముందుకెళ్లాలని సీనియర్ న్యాయవాదుల ఎదుట చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని సూచించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా సహా ఇతర కేసులగురించి చర్చించినట్టు సమాచారం.

**ఢిల్లీకి భట్టి విక్రమార్క, పొన్నం, వాకిటి..**

జీవో 9కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆదివారం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. వారి వెంట బీసీ సంక్షేమం, సంబంధిత శాఖల అధికారులు కూడా ఉన్నారు. జీవో 9కి అనుకూలంగా ప్రభుత్వం తరఫున వాదన లు వినిపిస్తున్న ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీతో వారు భేటీ కానున్నారు. కులగణన సర్వే మొదలుకుని జీవో 9 జారీకి దారి తీసిన పరిస్థితులు, ఇతర అంశాలను ఆయన కు వివరించనున్నారు. కాగా, మంత్రుల బృందం ఆదివారం రాత్రి సుప్రీంకోర్టులో తెలంగాణ స్టాండిం గ్ కౌన్సిల్ శ్రవణ్‌కుమార్‌తో సమావేశమై చర్చలు జరిపింది. కాగా, సుప్రీంలో పిటిషన్ దాఖలైన వెంట నే బీసీ సంక్షేమ శాఖ అధికారుల బృందం ఢిల్లీకి చేరుకుంది. బీసీ రిజర్వేషన్లు, అమలు, కొత్త జీవో తదితర అంశాలపై న్యాయవాదులతో చర్చించింది.

**సుప్రీంకోర్టు స్పందనపై నేతల్లో ఉత్కంఠ..**

జీవో 9ని కొట్టివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందన ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ అధికార కాంగ్రెస్ నేతల్లో నెలకొంది. ఇప్పటికే జీవో 9ని వ్యతిరేకిస్తూ హైకోర్టులోనూ పిటిషన్ దాఖలు కాగా.. దానిపై ఈ నెల 8న విచారణ జరగనుంది. అయితే ఆ జీవోకు మద్దతుగా ప్రజాప్రతినిధులు, సంఘాలతో హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేయించేందుకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోంది. ఈ ప్రయత్నాలు ఇలా కొనసాగుతుండగానే.. సుప్రీంకోర్టులోనూ జీవో 9కి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలైంది. దీంతో ఈ కేసు ఇప్పటికే హైకోర్టులో విచారణలో ఉన్నందున.. అక్కడే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు చెబుతుందా? లేక ఏదైనా సూచన చేస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా ఇచ్చిన ఈ జీవో.. చట్ట



విరుద్ధమంటూ పిటిషన్‌దారు పేర్కొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించడంలో న్యాయవాదులకు సహకారం అందించేందుకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అధికారులు ఢిల్లీకి వెళ్లారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

**ఎన్నికలపై ముందుకే..!**

జీవో 9పై న్యాయస్థానాల స్పందన ఎలా ఉన్నా.. ఎన్నికలపై ముందుకే వెళ్లాలన్న యోచనలో రాష్ట్రప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జీవో 9 పట్ల కోర్టులు సానుకూలంగా స్పందిస్తే ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం జరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ కోర్టుల స్పందన ప్రతికూలంగా ఉంటే.. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం ప్లాన్-బీ సిద్ధం చేసుకుని ఉన్నట్లు చెబుతున్నారు. జీవో 9 రాజ్యాంగ విరుద్ధమని, రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఒకవేళ సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పినా, లేక ఈ నెల 8న హైకోర్టు ఇలా సూచించినా.. తమ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లు ప్రకటించి ఎన్నికలపై ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే సాంకేతికంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది కాబట్టి.. ఎన్నికల షెడ్యూల్‌ను రీ షెడ్యూల్ చేయాల్సి రావచ్చునని అంటున్నారు.

**'జీవో 9తో ప్రాథమిక హక్కులకు భంగం'**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ ఈ నెల 4న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వంగా గోపాల్‌రెడ్డి.. అందు లో పలు అంశాలను ప్రస్తావించారు. "బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో 9ని తీసుకొచ్చింది. అయితే ఇప్పటికే ఎస్సీలకు అమల్లో ఉన్న 15%, ఎస్టీలకు 10 శాతంతో కలిపి రిజర్వేషన్లు 67 శాతానికి చేరుతాయి. ఇది ముమ్మాటికీ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285కు విరుద్ధం. జీవో 9 ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుంది. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. అయితే, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేస్తే తీవ్ర నష్టం జరిగే ప్రమాదంఉంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ఇవకాశాలు తక్కువగా ఉన్నందున నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించాం. అత్యవసర పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జీవో అమలుపై స్టే ఇవ్వండి" అని గోపాల్‌రెడ్డి పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.



# ఏకకాలంలో 8 కారిడార్లు



మొదటి పేజీ తరువాయి

మొత్తం 162.9 కిలోమీటర్ల పనులకుగాను రూ.43,847.22 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టులో 48 శాతం వాటా కింద అంతర్జాతీయ బ్యాంకుల నుంచి 2-4 శాతం వడ్డీతో రుణాలు సేకరించనుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం సావరీన్ గ్యారంటీ ఇవ్వడంతోపాటు తన వంతు వాటాగా 18 శాతం నిధులు సమకూర్చనుంది. ఇక ఎల్‌అండ్‌టీ నుంచి మొదటిదశ కారిడార్లను టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో రెండో దశలో ప్రతిపాదించిన అన్ని కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌లకు కేంద్రం నుంచి అనుమతి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీలోని వివిధ శాఖల మంత్రులను పలు దఫాలుగా కలిసి రెండో దశ విస్తరణ ప్రాధాన్యాన్ని వివరించారు.

**8 కారిడార్లకు వేర్వేరుగా టెండర్లు..**

ఎల్‌అండ్‌టీతో తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, నెట్ వర్కింగ్, టికెట్ ధరలన్నీ ఒకే గొడుగు కింద ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు ఎల్‌అండ్‌టీతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను కేంద్రానికి త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్రం నుంచి డీపీఆర్‌లకు గ్రీన్‌సిగ్నల్ లభించిన వెంటనే 8 కారిడార్లకు వేర్వేరుగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఒకే టెండర్ కింద అన్నింటినీ నిర్వహిస్తే పనులన్నీ ఆలస్యమవుతాయని భావిస్తోంది. దీంతో ఒక్కో సంస్థకు ఒక్కో కారిడార్‌ను అప్పగించి పూర్తి చేయించాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తక్కువ దూరం కలిగిన ఎల్‌బీనగర్-హయత్‌నగర్ (7.1 కిలోమీటర్లు), ఎంజీబీఎస-చాంద్రాయణగుట్ట (7.5 కిలోమీటర్లు), రాయదుర్గం-కోకాపేట్ నియోపోలీస్ (11.6 కిలోమీటర్లు) పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రెండో దశలోని పార్ట్-ఏలో ప్రతిపాదించిన ఓల్డ్‌సిటీ కారిడార్‌కు ఆస్తుల సేకరణ ఇప్పటివరకు 65 శాతం పూర్తయింది. నెలాఖరులోగా ఆస్తు లను సేకరించి టెండర్ పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**తగ్గనున్న మెట్రో డిపోలు..**

మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. మొదటి దశ కోసం సుమారు 90 ఎకరాల్లో ఉప్పల్, మియాపూర్ మెట్రో డిపోలను నిర్మించారు. అయితే రెండో దశలో నిర్మించనున్న 5 మార్గాల (ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్-పటాన్‌చెరు, రాయదుర్గం-కోకాపేట నియోపోలీస్, నాగోల్-శంషాబాబాద్ ఎయిర్‌పోర్టు, ఎంజీబీఎస-చాంద్రాయణగుట్ట)కు పాత డిపోలనే వినియోగించే అవకాశం ఉంది. మిగిలిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు-భారత్ ఫ్యూచర్ సిటీ, ప్యారడైజ్- మేడ్చల్, ప్యాట్నీ-శామీర్‌పేట మెట్రో మార్గాలకు కొత్తగా రెండు మెట్రో డిపోలను నిర్మిస్తే సరిపోతుందని మెట్రో అధికారులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవంగా మెట్రో డిపోల ఏర్పాటు కోసం సుమారు 100 ఎకరాల భూమి, నిర్మాణాల కోసం రూ.వందల కోట్ల నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే మొదటి దశలో ఇప్పటికే నిర్మించిన 2 డిపోల్లో మరిన్ని మెట్రో రైళ్లను పార్కింగ్ చేసుకొని, నిర్వహణ పనులు చేసుకునే అవకాశం ఉండడంతో డిపోల సంఖ్య తగ్గుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 6 అక్టోబర్ 2025





# గౌడ బిడ్డలు కలిసి ఏకమైతే సాధించలేనిది లేదు



## గోపా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టిపర్తి భాస్కర్, చెక్కిళ్ల మధుసూదన్

### యాదాద్రి భువనగిరి జిల్లాలో విజయవంతమైన గోపా సమావేశం

భువనగిరి, రోమింగ్ న్యూస్: గౌడ బిడ్డలు కలిసి ఏకమైతే సాధించలేనిది లేదని గోపా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు గొట్టిపర్తి భాస్కర్, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్ లు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా గోపా కమిటీ నిర్మాణం కోసం ఆదివారం భువనగిరి పట్టణ కేంద్రంలోనీ ఎస్వి హెూటల్ గోపా జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ఎదగడం ద్వారా ప్రభావవంత శక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. త్వరలోనే గోపా గోల్డెన్ జూబ్లీని జరుకోబోతుందని చెప్పారు. లక్ష సభ్యత్వమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని వివరించారు. జిల్లా నలుమూలల నుంచి పోరుగడ్డ భువనగిరికి తరలివచ్చిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా సమైక్యంగా ఉండి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు.

మెరుగైన సమాజం కోసం ముందుకు సాగుదాం అన్నారు. ప్రతిభ గల గౌడ బిడ్డలను ఆదుకోవడం విద్యాపరంగా అండగా నిలబడడం ఉద్యోగ నియామకాలలో సహకరించడం వ్యాపార వాణిజ్య రంగాలలో గౌడ బిడ్డలకు అండగా నిలబడడం కృషి చేస్తుందని చెప్పారు. గోపా కమిటీ నిర్మాణము, దాని బాధ్యత,దాని విధులు, గోపా ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్మ కంటి మీరయ్య గౌడు మాట్లాడుతూ చక్కటి రాష్ట్ర నాయకత్వం ఉందని దాని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తూ గౌడలకు మేలు చేసే కార్యక్రమాలు గోపా నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుమార్ గౌడ్, హరినాథ్ గౌడ్ ని, వెంకట్ గౌడ్ ని, బాలరాజ్ గౌడ్ ని ఇతర జిల్లా నాయకులను రాష్ట్ర నాయకత్వం అభినందించింది. మహిళా అడ్వకేట్ నర్సింగ్ యమునా లాంటివారు రావడం చాలా సంతోషకరమని కొనియాడారు. ముఖ్యంగా ఈనాటి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన వివిధ రకాల డిపార్ట్మెంట్లో పని చేస్తున్న, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న, వ్యాపారాలు చేస్తున్న, మీడియాలో పనిచేస్తున్న, సొంతంగా వ్యాపారాలు చేస్తున్న,దేశానికి అన్నం పెట్టే రైతన్నే మిన్న అని వ్యవసాయ వృత్తిలో కొనసాగుతున్న రైతులకు, వివిధ రకాల వృత్తులలో కొనసాగుతున్న గౌడ సోదరులందరికీ గోపా యాదాద్రి భువనగిరి జిల్లా పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు అని రాష్ట్ర కమిటీ తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి మనం బాధ్యత తీసుకున్న గోపా సభ్యత్వాలను పూర్తిచేసి ఇంతకు మించిన రెట్టింపు ఉత్సాహంతో సుమారు మూడు నాలుగు వందల మందితో 26/ 10/ 25 నాడు యాదాద్రి భువనగిరి జిల్లా గోపా నూతన కమిటీ నిర్మాణము చేసుకొని గోపా యొక్క విశిష్టతను చాటి చెప్పుదామని ఆశిస్తూ మరొకసారి జిల్లా కమిటీ పిలుపునందుకుని సమావేశానికి వచ్చినటువంటి వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నకరికంటే శ్రీనయ్య గౌడ్,నల్లగొండ జిల్లా గోపా అధ్యక్షులు దంతూరి సైదులు గౌడ్, ఈ సందర్భంగా గోపా నాయకులు నమిల భరత్ కుమార్ పాడిన పాట పలువురిని ఆకట్టుకున్నది.



## ముద్దగొని రామ్మోహన్‌గౌడ్‌కు ఘన సన్మానం





హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ప్రముఖ సోషల్ వర్కర్, గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దగొని రామ్మోహన్ గౌడ్ కు గురుసేవ పురస్కారం లభించింది. దసరా సందర్భంగా గురుస్వామి రాజు ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో అతిరిద మహారధుల కోలాహలం మధ్య రామ్మోహన్ గౌడ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిచేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తున్నానని చెప్పారు. రామ్మోహన్ గౌడ్ కు అవార్డు నుంచి సత్కరించడం పట్ల గోపాల్ రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు.

## శ్రీ వాసవి సేవాసమితి ద్వారా సామాజిక సేవలు



**సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొట్టమొదటి సారిగా శ్రీ వాసవి సేవాసమితి ద్వారా సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు.ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి నగర్ లో గల శ్రీ వాసవి ఎన్ క్లేవ్ లో గల శ్రీ వాసవి సేవాసమితి జిల్లా కార్యాలయము లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల క్రితం వనపర్తిలో పూరి సురేష్ ఏర్పాటు చేసిన శ్రీ వాసవి సేవాసమితి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించిన కరోనా సమయం లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సుమారు 50 వేల మందికి ఆనందయ్య మందు పంపిణీ చేసినట్లు తెలిపారు. మొట్టమొదటి సారిగా సూర్యాపేట జిల్లా లో శ్రీ వాసవి సేవాసమితి ద్వారా పేద ఆర్యవైశ్యుల తో పాటు అన్ని వర్గాల ప్రజలకు సేవ లు అందించ నున్నట్లు తెలిపారు.నేటి యువత స్వచ్ఛంద సంస్థ లో సబ్యులు గా చేరి సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో శ్రీ వాసవి సేవాసమితి సబ్యులు సోమా ప్రవీణ్,శ్రీరంగం రమేష్,తోట అరుణ్ కుమార్, అనంతుల రాజేశ్వర్, దేవరశెట్టి నాగరాజు,కొండా అనిల్ కుమార్,చందా రాజశేఖర్, కుంచపర్తి రాజశేఖర్, తాటిశెట్టి హనుమంతు, కలకోటి నరసయ్య ఉన్నారు.

# పండగ భక్తులతో యాదగిరిగుట్ట కిటకిట

## ధర్మదర్శనానికి 3 గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం

### ఆలయ ఖజానాకు రూ.50.54 లక్షల ఇన్ కమ్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దసరా పండుగ తిరుగు ప్రయాణ భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. దసరా పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన భక్తులు.. తిరుగు ప్రయాణంలో స్వామివారిని దర్శించుకోవడానికి కుటుంబ సమేతంగా భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కారణంగా.. బస్ బే, ధర్మదర్శన, ప్రత్యేక దర్శన క్యూలైన్లు, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు రద్దీగా మారాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంట సమయం పట్టింది. ఇక ఆలయంలో నిర్వహించిన నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హెూమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలైన నిత్య పూజలు.. రాత్రి పవళింపుసేవ, శయనోత్సవ సేవతో ము-ంగిశాయి. ఇక భక్తులు జరిపించిన నిత్య పూజలు, నిత్య కైంకార్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ. 50,54,516 ఆదాయం వచ్చింది. ప్రసాద విక్రయం ద్వారా రూ. 19,13,900, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ. 7 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ. 9.30 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ. 4,66,800 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.





## యాదగిరీశుడి సేవలో డీజీపీ శివధర్ రెడ్డి



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా స్వామివారి దర్శనం కోసం యాదగిరిగుట్టకు వచ్చిన డీజీపీకి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మొక్కను బహూకరించి స్వాగతం పలికారు. అనంతరం తూర్పు రాజగోపురం నుండి త్రితల గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించిన డీజీపీకి ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. మొదట క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకుని గర్భగుడికి అభిముఖంగా ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భాలయంలోకి వెళ్లారు. గర్భగుడిలో లక్ష్మీసమేత నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. కలెక్టర్ లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం ఆలయ ఏఈవోలు గజవెల్లి రఘు, జూషెట్టి కృష్ణ గౌడ్, నవీన్ కుమార్ యాదగిరిగుట్ట ఆలయ నమూనా ఫొటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, తహశీల్దార్ గణేష్ నాయక్, సీఐ భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 6 అక్టోబర్ 2025





# వరద బాధితులకు సాయమేదీ?

**కామారెడ్డిలో ముఖ్యమంత్రి పర్యటించినా నయా పైసా సహాయం అందలేదు**

**కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ కేంద్రం నుంచి నిధులు తేలేకపోతున్నారు**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



**నాగిరెడ్డిపేట :** రాష్ట్రంలో వరద బాదితులకు సహాయం అందించడంలో రేవంత్ రెడ్డి సర్కారు విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటించి నెల రోజులు గడుస్తున్నా బాధితులకు నయా పైసా కూడా సహాయం అందలేదన్నారు. హరీశ్‌రావు ఆదివారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో మంజీరా వరద ముంపునకు గురైన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వరదలతో కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వందలాది ఇళ్లు కూలిపోయాయన్నారు. జిల్లా అధికారులు సర్వే చేసి వరదల వల్ల రూ.344 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినా 34 రూపాయలు కూడా జిల్లాకు విడుదల కాలేదని విమర్శించారు. బాధిత రైతులకు తక్షణమే ఎకరాకు రూ.25 వేల సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సైతం జిల్లావైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. జిల్లాలో కోతకు గురైన రోడ్లు, గండ్లు పడిన కాల్వలు, చెరువుల మరమ్మతు పనులను కూడా ప్రారంభించలేదని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్‌లో భూముల ధరలు తగ్గాయి కానీ మద్యం ధరలు, ఆర్టీసీ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తే హామీలపై నిలదీయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. ఎక్కడైనా బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఒక్కొక్కరి సంగతి చూస్తామని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని, అది పేదల పార్టీ కాదని, ధనవంతుల పార్టీ అని విమర్శించారు. రాష్ట్రంలో వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు కేంద్ర నిధులు తేవడం లేదని ప్రశ్నించారు. రైల్వే ప్రాజెక్టులకు సహా తెలంగాణకు నిధుల కేటాయింపులో మోదీ సర్కారు వివక్ష చూపుతున్నా రేవంత్ ప్రభుత్వం గట్టిగా నిలదీయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# విజయవాడ- హైదరాబాద్ హైవేపై భారీ ట్రాఫిక్

**సెలవులు ముగియడంతో స్వస్థలాల నుంచి తిరుగు ప్రయాణాలు**

**టోల్‌ప్లాజాల దగ్గర బారులు తీరిన వాహనాలు**



**చౌటుప్పల్, అక్టోబరు 5 :** పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు ముగిశాయి. ఉద్యోగులకు వారాంతపు సెలవులు కూడా పూర్తయ్యాయి. దీంతో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల వద్ద పెద్దసంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. సాధారణ రోజుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని పంతంగి టోల్‌ప్లాజా మీదుగా 30వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ, ఆదివారం ఒక్కరోజే 45వేలకు పైగా వాహనాలు ప్రయాణించాయని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. కాగా, దసరా పండుగ తిరుగు ప్రయాణాల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 1,050 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశామని టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడుపుతామని పేర్కొంది.

**నందిగామ బైపాసలో ట్రాఫిక్ జామ్**

జాతీయ రహదారుల శాఖ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నందిగామ వై జంక్షన్ వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఆకస్మికంగా ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా సందర్భంగా గతవారం హైదరాబాద్ నుంచి వేలాది వాహనాలు విజయవాడ వైపు వచ్చాయి. రహదారిపై గుంతల వల్ల భారీగా తరలివస్తున్న వాహనాలు నందిగామ సమీపంలో గంటల తరబడి ఆగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పండుగ సెలవులు ముగిసిన తర్వాత వారంతా అదే రోడ్డుపై తిరుగు ప్రయాణం చేస్తారని తెలిసినా అధికారులు మరమ్మతులు చేపట్టక పోవడంతో వాహనదారులు మరోసారి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రధాన కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ మధ్య ఏర్పడిన ఆర్థిక వివాదాలతోనే నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలిసింది.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నాటకాలు

**స్థానిక సంస్థలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన అన్యాయాలపై విస్తృత ప్రచారం చేయాలి**

**బీజేపీ పదాధికారుల భేటీలో నిర్ణయం.. ఎంపీలు, ఎమ్మెల్యేలకు జిల్లాల బాధ్యతలు**

**మనది టీం బీజేపీ: అధ్యక్షుడు రాంచందర్‌రావు.. కలిసికట్టుగా పనిచేద్దాం: కిషన్‌రెడ్డి**

**ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి**

**రెండు జిల్లాల అధ్యక్షుల పని తీరుపై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అసహనం**



**హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థలకు చేసిన అన్యాయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని మండిపడింది. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేసిన అంశాలతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తీర్మానించింది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలుకు పార్టీ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎంపీలు, ఎమ్మెల్యేలకు జిల్లాల బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రచార వ్యూహం అమలు చేయాలని.. అందరూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. కలిసికట్టుగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. 'మనది టీం బీజేపీ. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జుబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా సత్తా చాటుదాం. ప్రత్యర్థుల ఎత్తులను తిప్పికొడదాం' అని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచితీరదామన్నారు. అందరినీ కలుపుకొని వెళదామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వార్డు ఎన్నికనూ కీలకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు గతంలో పనిచేసిన జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పదాధికారులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. వారిని కూడా జడ్పీటీసీ ఇన్‌చార్జులుగా, జిల్లా ఇన్‌చార్జులుగా నియమించాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఈ నెల 8న మరోసారి విస్తృత సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతంరావు తెలిపారు. సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. మోదీ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలంటే స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.

**ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం: వెంకటరమణారెడ్డి**

పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయ లోపం ఏర్పడిందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి కూర్చోలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నట్లు సమాచారం. 'సమావేశాలకు రావడం, వెళ్లడం.. ఇదేనా మా పని? క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు ఎక్కడ?' అని అని వెంకటరమణారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ ఆఫీసులో కార్యక్రమాలు నిర్దేశించినా, క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదని పేర్కొన్నట్లు సమాచారం. తన నియోజకవర్గ పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుల తీరు పట్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీలో సమన్వయం ఉండాల్సింది పోయి, కనీస సమాచారం కూడా లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎలా? అని ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.



# బీసీ రిజర్వేషన్ల కోసం మహోద్యమం

**కోర్టులను ఆశ్రయిస్తూనే ప్రజా పోరాటాలు**


**బీసీ అఖిలపక్ష నేతల సమావేశంలో తీర్మానం**

**ఖైరతాబాద్, అక్టోబరు 5 :** బీసీ రిజర్వేషన్లను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించడంపై బీసీ అఖిలపక్ష నేతలు భగ్గుమన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా పోరాడుతూనే తెలంగాణ ఉద్యమం మాదిరిగా పోరాటానికి సిద్ధం కావాలని తీర్మానించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్డీకపూల్‌లోని అశోకా హోటల్‌లో బీసీ ప్రజా ప్రతినిధుల, బీసీ కుల సంఘాల, అఖిలపక్ష సమావేశం ఎంపీ ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల సాధన పోరాటానికి ఇదే సరైన సమయమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గదని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా అందరం కలసి పని చేయాలని మాజీ గవర్నర్ దత్తాత్రేయ అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటాయని, ఇక్కడ కూడా రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీ, పార్లమెంట్‌లో కృషి జరగాలని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో పోరాడుతూనే ప్రజా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్లే మన వద్ద అమలయ్యేలా బీసీలు ఐక్యంగా పోరాడాలని మాజీ ఎంపీ వీహెచ్ అన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మల్క కొమురయ్యతో పాటు కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

# బడుగుల గొంతుక కాకా వెంకటస్వామి

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు..**

**భట్టి, మహేశ్ గౌడ్, పలువురు మంత్రులు**



**రవీంద్రభారతి:** బడుగు, బలహీన వర్గాల గొంతుక గడ్డం వెంకటస్వామి (కాకా) అని.. ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వక్తలు కొనియాడారు. కాకా సేవలు చిరస్మరణీయమని.. ఆయన ఆశయాల సాధనకు యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం గడ్డం వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటు రవీంద్రభారతిలోనూ తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాకా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కేంద్రమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా కాకా చేసిన సేవలు మరువలేనివని భట్టి అన్నారు. దేశంలో కార్మికుల ఉన్నతికి పాటుపడ్డారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో నీతి, నిజాయతీలకు నిలువుటద్దం కాకా అని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో కాకా తనను ఎంతో ప్రోత్సహించి, ప్రేరణ కలిగించారని శ్రీధర్ బాబు గుర్తు చేసుకున్నారు. పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ సాధనే ధ్యేయంగా కాకా పనిచేశారని.. మలిదశ ఉద్యమంలో తనకు, వివేక్ వెంటకస్వామికి సలహాలు, సూచనలిచ్చారన్నారు. అత్యంత పేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగిన మహోన్నత వ్యక్తి కాకా అని జూపల్లి కొనియాడారు. తెలంగాణ సాధన కోసం చివరి దాకా పోరాడారన్నారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తన తండ్రి (కాకా)ని ఆదర్శంగా తీసుకునే రాజకీయాల్లోకి వచ్చానని.. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కాగా, కాకా జయంతి వేడుకలు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ నిర్వహించారు. భవన్ రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్, ప్రభుత్వ కార్యదర్శి (సమన్వయం) గౌరవ్ ఉప్పల్ సహా అధికారులు, సిబ్బంది కాకా చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

# ఆగి ఉన్న కారును ఢీకొన్న బస్సు

**రెండు బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జయిన కారు**

**చిట్యాల :** ఆగి ఉన్న కారును ఓ ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో అది దాని ముందు ఉన్న మరో ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన జోష్‌కుమార్, విజయవాడకు చెందిన పైలా మురళి, మచిలీపట్నానికి చెందిన చల్ల శ్రీహర్షలు శనివారం విజయవాడ దుర్గమ్మను దర్శించుకుని కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున చిట్యాల శివారులోని ఓ పెట్రోల్ బంకు వద్ద రహదారిపై వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక ఆగి ఉన్న వారి కారును హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆ కారు రెండు బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. వెంటనే ఇతర వాహనదారులు కారులో ఉన్న ముగ్గురిని బయటకు తీశారు. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స కోసం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు.

# డార్జిలింగ్‌లో వరుణుడి బీభత్సం

**భారీ వర్షాలకు వరదలు, విరిగిపడ్డ కొండచరియలు**

**వేర్వేరు ప్రాంతాల్లో 20 మంది దుర్మరణం**



**డార్జిలింగ్, అక్టోబరు 5 :** పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల వల్ల డార్జిలింగ్, ఆ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తగా, చాలా చోట్ల పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో డార్జిలింగ్, ఆ జిల్లాలోని మిరీక్ సహా ఇతర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఘటనల్లో పలువురు చిన్నారులు సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క మిరీక్ ప్రాంతంలోనే 11 మంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రకటించాయి. మిరీక్, సిలిగురి ప్రాంతాలను కలిపే బాలాసోన్ నదిపై దుదియాలో ఉన్న ఓ వంతెన కూలిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా తెగిపోయాయి. కొండచరియలు విరిగి పడడంతో పెద్ద సంఖ్యలో ఇళ్లు ధ్వంసమై చాలా మంది నిరాశ్రయులవ్వగా.. పలువురి ఆచూకీ గల్లంతయింది. వర్షాలకు తోడు కొండచరియలు విరిగి పడుతుండడంతో డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసేశారు. డార్జిలింగ్ అందాలను చూసేందుకు వచ్చిన వేల మంది పర్యాటకులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. సోమవారం వరకు డార్జిలింగ్‌లో భారీ వర్షాలు కొనసాగుతాయనే వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోపక్క, భూటాన్‌లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందనే హెచ్చరికలు కూడా ఉన్నాయి. కాగా, డార్జిలింగ్‌లో విపత్కర పరిస్థితిపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరోవైపు, నేపాల్‌లోనూ భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో నేపాల్‌లో 51 మంది ప్రాణాలు కోల్పోయారు.

# నేడు ఆంద్రోత్ జల ప్రవేశం

**నేవీ అమ్ముల పొదిలోమరో నౌక**

**కోల్‌కతాలో తయారీ.. 80 శాతం పరికరాలు భారత్‌లోనే ఉత్పత్తి**

**విశాఖపట్నం, :** భారత నౌకాదళం అమ్ముల పొదిలోకి మరో యుద్ధ నౌక చేరనుంది. తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో శత్రు దేశాల జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే యుద్ధనౌక ఆంద్రోత్ సోమవారం విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో జలప్రవేశం చేయనుంది. యాంటీ సబ్‌మెరైన్ వాటర్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎసడబ్ల్యూ-ఎస్‌డబ్ల్యూసీ)గా వ్యవహరించే ఆంద్రోత్.. ఇండియన్ నేవీకి రెండో ఏఎసడబ్ల్యూ-ఎసడబ్ల్యూసీ నౌక కావడం గమనార్హం. తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ సోమవారం ఉదయం ఈ నౌకను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఆంద్రోత్ చేరికతో భారత నౌకాదళం శక్తి సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎసఈ) నిర్మించింది. ఈ నౌక తయారీలో వినియోగించిన పరికరాల్లో 80 దేశీయంగా ఉత్పత్తి చేసినవే కావడం విశేషం. వినూత్నమైన సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించేలా ఈ నౌక నిర్మాణం జరిగింది. ఆంద్రోత్ సబ్‌మెరైన్ల ఉనికిని పసిగట్టడంలో కీలకంగా పని చేయనుంది. అత్యాధునిక తేలికపాటి టార్పెడోలు, సబ్‌మెరైన్ల విధ్వంసక రాకెట్లను కలిగి ఉంటుంది. దేశ సముద్ర భద్రతలో ఈ నౌక కీలకంగా నిలుస్తుందని నేవీ అధికారులు పేర్కొన్నారు.

# బిహార్ ఎన్నికలు నవంబరు 22లోపే

**ఛఠ్ పూజలాగే ఉత్సాహంగా పాల్గొనాలి**

**ఓటర్లకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పిలుపు**

**ఎన్నికల సన్నద్ధతపై పట్నాలో సమీక్ష**



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు.. శాసనసభ పదవీకాలం ముగిసే నవంబరు 22వ తేదీలోపే జరుగుతాయని ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఛఠ్ పూజ(ఈ నెల 25 నుంచి 28 వరకు) మాదిరిగానే ఓటింగ్‌లోనూ ఆనందోత్సాహాలతో పాల్గొనాలని రాష్ట్ర ఓటర్లకు పిలుపిచ్చారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశామన్నారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)ను చట్టబద్ధంగానే చేపట్టామని చెప్పారు. త్వరలోనే దీనిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. రెండ్రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం రెండో రోజు ఆదివారం ఆయన పట్నాలో సహచర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలతో కలిసి అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లు కూడా దీనికి హాజరయ్యారు. బిహార్ ఎన్నికలతో మొదలలయ్యే పలు సంస్కరణలను సీఈసీ విశదీకరించారు. ఇక నుంచి ఈ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా పోలింగ్ కేంద్రానికి 1,200 మంది మాత్రమే ఓటర్లు ఉంటారని చెప్పారు. 'బిహార్లోని వైశాలి ప్రపంచానికే ప్రజాస్వామ్య మార్గాన్ని ఎలా చూపిందో.. అదే విధంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళనలో వీరు దేశానికే స్ఫూర్తిగా నిలిచారు' అని కొనియాడారు. ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల సవరణ ప్రజాప్రాతినిధ్య చట్టప్రకారం చట్టబద్ధమేనని.. ఎన్నికలు ముగిశాక సవరించడం కుదరదని గుర్తుచేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సెప్టెంబరు 30న ఓటర్ల జాబితాను ప్రచురించామని.. చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలున్నా.. అర్హులైనవారిని చేర్చకపోయినా.. అభ్యంతరాలు తెలియజేసేందుకు ఇప్పటికీ పది రోజుల వ్యవధి ఉందని చెప్పారు. అన్ని అభ్యంతరాలను ఓటర్ నమోదు అధికారు(ఈఆర్‌వో)ల స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. నామినేషన్లు మొదలు కాగానే ఓటర్ల జాబితా నిశ్చలంగా ఉంటుందని.. ఎన్నికల ప్రక్రియ ముగిసేదాకా అందులో మార్పులకు ఆస్కారం ఉండదన్నారు.

**పారదర్శకత కోసం 17 సంస్కరణలు..**

ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం 17 సంస్కరణలను బిహార్ ఎన్నికల నుంచే ఎన్నికల కమిషన్ శ్రీకారం చుడుతోందని జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో పోలింగ్ సందర్భంగా కొన్ని, ఓట్ల లెక్కింపు సమయంలో కొన్ని అమలవుతాయన్నారు. ఇకపై ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండరని స్పష్టంచేశారు. ప్రస్తుతం 1,500 మంది ఓటర్లు ఉంటున్నారు. తాజా సవరణతో బిహార్లో ఇప్పుడున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరుగుతాయి.

బీఎల్‌వోలు గుర్తింపు కార్డులు ధరించడం తప్పనిసరి. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లు తమ మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేసేందుకు ఒక కేంద్రం ఏర్పాటుచేస్తారు.

ఎన్నికల గుర్తు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఈవీఎంలోని బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి ఫొటో బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటోంది. వారిని గుర్తించడం కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఫొటోలు ఇక కలర్‌లో ఉంటాయి. బిహార్‌తో మొదలుపెట్టి ఇక దేశవ్యాప్తంగా ఇదే అమలవుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఉంటారో ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే ఫాం-17సీకి, ఈవీఎం కౌంటింగ్ యూనిట్‌లో పోలైన ఓట్లల సరిపోలనప్పుడు వీవీప్యాట్లన్నిటినీ పూర్తిగా లెక్కిస్తారు.

ఇక మీదట ఓట్ల లెక్కింపులో తుది రెండు రౌండ్ల ముందు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రీకౌంట్ చేస్తారు.

**ఆధార్ గుర్తింపు కార్డు మాత్రమే..**

గుర్తింపు ధ్రువపత్రాల్లో ఆధార్‌ను చేర్చడంపై జ్ఞానేశ్‌కుమార్ స్పష్టత ఇచ్చారు. అది గుర్తింపు కార్డు మాత్రమేనన్నారు. అదీగాక ఆధార్ నంబర్ ఇవ్వాలని ఎన్యుమరేషన్ ఫాంలో ఎన్నికల కమిషనే కోరిందని గుర్తుచేశారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. ఆధార్ చట్టం కింద కూడా ఆధార్ కార్డును పుట్టినరోజు, చిరునామా, పౌరసత్వాలకు ధ్రువీకరణగా పరిగణించడానికి వీల్లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 26వ సెక్షన్ ప్రకారం అది ఐచ్ఛికం మాత్రమే' అని ఆయన వివరించారు.

# తల్లిని చంపిన కన్నకొడుకు

**డబ్బులివ్వలేదని కత్తితో గొంతుకోసిన కొడుకు**

**గారాబంగా పెంచడమే పాపం**

**హైదరాబాద్ నుంచి నేరుగా వచ్చి తల్లితో గొడవపడి హత్య**

**తండ్రి బెడ్‌రూమ్‌లో ఉండగా గడియపెట్టి దారుణం**

**తర్వాత ఇంట్లోకి వెళ్లి సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ నవ్వులు**

**పోలియో బాధిత ఉపాధ్యాయురాలి త్యాగాలకు బహుమానం**

**కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం**



**ప్రొద్దుటూరు, అక్టోబరు 5 :** పోలియో బాధితురాలైనప్పటికీ కష్టపడి ఉపాధ్యాయురాలిగా ఎదిగారు. భర్తకు సరైన ఉపాధి లేకపోయినా.. తన జీతంతో ఇంటిని నిలబెట్టారు. ఒక్కగానొక్క కొడుకును ఎంతో గారాబంగా పెంచారు. ఉన్నత చదువులు చదివించారు. కానీ ఆమె త్యాగాలకు విలువలేకుండా పోయింది. డబ్బులివ్వలేదని కన్నబిడ్డే.. కనికరం లేకుండా ఆమెను కత్తితో గొంతు కోసి చంపేశాడు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం జరిగిందీ దారుణం. పోలీసుల కథనం మేరకు.. ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసే ఉప్పలపాటి లక్ష్మీదేవి (52)ని ప్రొద్దుటూరు శ్రీరామ్‌నగర్‌లో ఉన్న తమ ఇంట్లోనే ఆమెను కన్న కొడుకు యశ్వంత్‌రెడ్డి (26) గొంతుకోసి చంపేశాడు. ఉదయమే హైదరాబాద్ నుంచి వచ్చిన యశ్వంత్.. అప్పటికి తండ్రి విజయభాస్కర్‌రెడ్డి బెడ్‌రూములో ఉండగా గడియ పెట్టాడు. ఆ తర్వాత తల్లిని చంపి, మృతదేహాన్ని వంట గది నుంచి ఈడ్చుకొచ్చి కాంపౌండ్‌లో పడేశాడు. తర్వాత ఇంట్లోకి వెళ్లి తాళం వేసుకొని హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ కూర్చున్నాడు. నీ భార్యను చంపాను అని గట్టిగా అరవడంతో నివ్వెరపోయిన తండ్రి కేకలు వేశాడు. లక్ష్మీదేవి మృతదేహం నుంచి రక్తం రోడ్డుపైకి రావడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి తలుపులు పగుల గొట్టి యశ్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అతడు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ నవ్వుతూ కనిపించాడని పోలీసులు తెలిపారు. తండ్రి విజయభాస్కర్‌రెడ్డిని గదిలో నుంచి బయటకు తీసుకొచ్చారు. హత్య టీటౌన్ పరిధిలో జరగడంతో త్రీటౌన్ పోలీసులు కేసును విచారిస్తున్నారు.

**ఉన్నత చదువులు చదివి.. ఉద్యోగం లేక...**

యశ్వంత్ నాలుగేళ్ల క్రితం బీటెక్ పూర్తవడంతో జాబ్ కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తల్లి నెలనెలా ఖర్చులకు డబ్బు పంపేవారు. ఈ క్రమంలో సినిమాలో నటించాలని చెబుతుండేవాడని కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాళ్లు తెలిపారు. ఉద్యోగం వద్దు ఏమీ వద్దు ఇంటికి వచ్చేయాలని తల్లి అంటుంటే అతడు డబ్బు కోసం తరచూ ఆమెను వేధించేవాడని చెబుతున్నారు. గత నెలలో రూ.10 వేలు పంపినా మళ్లీ డబ్బులు అడగటంతో ఆమె మూడు వేలే పంపారు. దీంతో తల్లిపై కక్ష పెట్టుకుని హైదరాబాద్ నుంచి వచ్చి వాగ్వాదం పెట్టుకొని, వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు కోసి చంపాడు.

**రెండు కాళ్లూ సరిగా లేకున్నా...**

లక్ష్మీదేవికి పుట్టుకతోనే పోలియో. రెండు కాళ్లూ సరిగా లేకున్నా, కష్టపడి టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆమెను రోజూ భర్త విజయ్‌భాస్కరరెడ్డి స్కూలుకు తీసుకువెళ్లి, మళ్లీ తీసుకొస్తుంటారు. ఆయన మొదట్లో సరైన ఉపాధి లేక పెయింట్ పని చేసేవారు. ఆ తర్వాత బార్‌లో పనిచేసేవారు. లక్ష్మీదేవి కష్టంతో కష్టపడి శ్రీరాంనగర్‌లో సొంత ఇల్లు కొనుక్కున్నారు. కొడుకును అల్లారు ముద్దుగా పెంచుకుని లక్షలు ఖర్చు పెట్టి చెన్నైలో ఇంటర్, బీటెక్ చదివించారు. అతడికి ఉద్యోగం రాకున్నా నాలుగేళ్లుగా వేలకు వేలు ఇచ్చి పోషిస్తున్నారు. ఇటీవల లక్ష్మీదేవి కింద పడి కాలికి గాయమై మూడు నెలలు బెడ్ రెస్టులో ఉన్నారు. అలాంటప్పుడు కూడా ఆమెను చూడ్డానికి యశ్వంత్ రాలేదని బంధువులు, చుట్టుపక్కల వారు చెబుతున్నారు. దీంతో భార్యను చూసుకోవడానికి విజయ భాస్కరరెడ్డి పని మానేసి ఇంటి వద్దనే ఉంటున్నారు.

# నాణ్యతలేని మందులతో ప్రజలకు ప్రాణ సంకటం

**రసాయనం కలిసిన దగ్గుమందుతో**

**మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 14 మంది మృతి**

అదో చిన్న ఫార్మా కంపెనీ.. ఎన్నో మందులు తయారు చేసి అమ్ముతోంది.. పెద్ద కంపెనీలతో పోటీపడలేక అడ్డదారులు తొక్కుతోంది.. మందులపై ఎక్కువ ఎమ్మార్పీ (గరిష్ట చిల్లర ధర) ముద్రించి.. అతి తక్కువ ధరకే మందుల షాపులకు హోల్‌సేల్‌గా సరఫరా చేస్తుంది.. వైద్యులకు అడ్డగోలు కమీషన్లు ఆశచూపి.. పేషెంట్లకు తమ మందులే రాసేలా ప్రలోభపెడుతుంది.. ఇటు వైద్యులకు, అటు మందుల షాపులకు బోలెడు లాభం.. ఇంతదాకా బాగానే ఉంది. కానీ అతి తక్కువ ధరకు మందులు, ఆపై కమీషన్లు ఇస్తూ, తాను కూడా లాభం పొందాలంటే.. ఆ ఫార్మా కంపెనీ ఎంత నాణ్యంగా మందులు తయారు చేస్తుంది? చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయదా? ప్రాణాలకు ప్రమాదం తలెత్తదా? మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో అదే జరిగింది. ఓ చిన్న ఫార్మా కంపెనీ తయారు చేసిన దగ్గు మందులోని విష పదార్థాల కారణంగా ముక్కుపచ్చలారని 14మంది చిన్నారులు చనిపోయారు.

**ప్రమాదకర రసాయనం కలవడంతో..**

మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో పిల్లలకు ఇచ్చిన 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందును ల్యాబ్‌లలో పరీక్షించగా 'డైథైలీన్ గ్లైకాల్ (డీఈజీ), ఇథైలీన్ గ్లైకాల్ (ఈజీ)'గా పిలిచే ప్రమాదకర రసాయనాల ఆనవాళ్లు ఉన్నట్టు తేలింది. తమిళనాడులోని కాంచీపురంలో శ్రేసన్ ఫార్మా కంపెనీకి చెందిన యూనిట్‌లో ఈ దగ్గు మందు తయారైంది. డీఈజీ, ఈజీ రసాయనాలను పరిశ్రమల్లో పెయింట్లు, బ్రేక్ ఫ్లూయిడ్స్, కొన్ని రకాల ప్లాస్టిక్ తయారీలో వినియోగిస్తారు. మందుల తయారీకి వాటితో ఏమాత్రం సంబంధం ఉండదు. అయితే ఔషధాల తయారీలో వాడే గ్లిసరిన్ వంటి ముడి పదార్థాల రవాణా సమయంలో వాటిలో డీఈజీ, ఈజీ చేరే అవకాశం ఉంటుంది. డీఈజీ, ఈజీ మన శరీరంలో మూత్రపిండాలు, కాలేయంతోపాటు నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతాయి.

**వైద్యులు, దుకాణదారుల కక్కుర్తితో..**

చిన్న ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వైద్యులను, మందుల దుకాణాల వారిని ప్రలోభపెట్టడం సాధారణంగా మారిపోయింది. అతి తక్కువ ధరకు ఇచ్చే ఆ మందులపై ఎమ్మార్పీ మాత్రం పెద్ద పెద్ద కంపెనీల మందులకన్నా ఎక్కువగా ఉంటుంది. దీనితో వైద్యులు, దుకాణాల వారికి భారీగా మార్జిన్లు మిగులుతాయి. దీనితో వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు ఆ కంపెనీల మందులే రాస్తున్నారు. ఫార్మా కంపెనీల్లో పరిస్థితులు, పరికరాలు, ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను సంబంధిత ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, తూతూమంత్రంగా పరిశీలించి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**'దగ్గు మందు' కంపెనీల్లో తనిఖీలు**

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో దగ్గు మందుతో చిన్నారులు మృతి చెందడంతో కేంద్రం అప్రమత్తమైంది. ఆదివారం అన్ని రాష్ట్రాల వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా దగ్గు మందు తయారీ సంస్థల వివరాలు సేకరించి.. వెంటనే ఆయా యూనిట్లలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు, పరీక్షలకు ఏర్పాట్లు ప్రారంభించారు.

## పిల్లల మృతి కేసులో వైద్యుడి అరెస్టు

మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో దగ్గుమందు కారణంగా పిల్లలు మృతి చెందిన ఘటనలో ప్రభుత్వ వైద్యుడు ప్రవీణ్ సోనిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఈ దగ్గుమందు తయారుచేసిన సంస్థపైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. కోల్డ్రిఫ్ దగ్గు మందుపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. ప్రవీణ్ సోని ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూ ఈ దగ్గుమందును సిఫారసు చేసినట్లు ఛింద్వారా ఎస్పీ చెప్పారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రవీణ్‌ను వైద్య విధుల నుంచి సస్పెండ్ చేసింది. మరోవైపు తమిళనాడు డ్రగ్ కంట్రోల్ అధికారులు ఈ నెల 2వ తేదీన ఇచ్చిన తమ నివేదికలో శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ తయారుచేసిన కోల్డ్రిఫ్ దగ్గుమందు డైఇథలీన్ గ్లైకాల్(48.6)తో కల్తీ అయ్యిందని పేర్కొంది.



# ఈ సమస్యలు ఉన్నవారు.. ఉదయం నిద్రలేవగానే నీరు తాగొద్దు..!

ఉదయం నిద్రలేచిన తర్వాత శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం కోసం చాలా మంది నీరు తాగుతారు. అయితే, ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉదయం నిద్రలేచిన వెంటనే నీరు తాగడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఏ సమస్యలు ఉన్నవారు నీరు తాగకూడదో ఇప్పుడు తెలుసుకుందాం..

ఖాళీ కడుపుతో నీరు తాగడం ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి . ఈ అలవాటు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ ఇది అందరికీ మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదయం ఖాళీ కడుపుతో నీరు త్రాగడం మంచి అలవాటు అయినప్పటికీ, కొంతమంది ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం ఎవరికి మంచిది కాదు?

సాధారణంగా, దంత సమస్యలు ఉన్నవారు ఖాళీ కడుపుతో నేరుగా నీరు తాగకూడదు. ఇందులో పయోరియా (చిగుళ్ల వ్యాధి), నోటి పూతలు, నోటి క్యాన్సర్ వంటి సమస్యలు ఉన్నాయి. ఈ వ్యాధులు ఉన్నవారికి, లాలాజలంలోని హానికరమైన బాక్టీరియా ఇన్ఫెక్షన్లకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి వారు ఉదయం నిద్రలేచిన వెంటనే నీరు తాగితే, నీటితో పాటు లాలాజలాన్ని మింగితే, హానికరమైన బాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తాయి. అందువల్ల, అటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నీరు తాగే ముందు మౌత్ వాష్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడు నోటిలోని బ్యాక్టీరియా, విషపూరిత పదార్థాలు బయటకు వస్తాయి. ఆ తర్వాత, నీరు తాగడానికి సురక్షితంగా ఉంటుందని చెబుతున్నారు.

ఆరోగ్యవంతులైన వ్యక్తులు, లాలాజలాన్ని ఉమ్మివేయడం కంటే మింగడం మంచిదని భావిస్తారు. ఎందుకంటే లాలాజలంలోని ఎంజైమ్‌లు జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తాయి. శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అందువల్ల, అనవసరంగా లాలాజలాన్ని ఉమ్మివేయడం ఆరోగ్యానికి హానికరం. ఖాళీ కడుపుతో సరిగ్గా నీరు తాగడం, నోటి పరిశుభ్రతను కాపాడుకోవడం వల్ల మన మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది.



# నాన్ వెజ్ ఎక్కువగా తిని ఇబ్బంది పడుతున్నారా? ఇలా చేయండి

తెలుగు రాష్ట్రాల్లో అక్టోబర్ 2న అటు దసరా, ఇటు గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ జయంతి సందర్భంగా మాంసాహారం, మద్యపాన నిషేధం ఉన్నప్పటికీ మన వాళ్లు మాత్రం ముక్క, చుక్క విషయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కాలేదని చెప్పాలి. ఎందుకంటే, దసరా పెద్ద పండుగ కావడంతో నచ్చిన మాంసాహార వంటకాలను ఫుల్‌గా లాగించేశారు. ఈసారి మందు, మాంసం పబ్లిక్‌గా దొరక్కున్నా కూడా ముందుగానే సమకూర్చుకుని తమ సరదా తీర్చుకున్నారు. అయితే, మీరు కూడా దసరా సందర్భంగా నాన్ వెజ్ ఫుల్‌గా తిని ఇప్పుడు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారా? మీ కోసం కొన్ని సింపుల్ హెల్తీ టిప్స్..

నాన్ వెజ్ ఎక్కువగా తిన్నవారు లైట్, ఫైబర్ రిచ్, లోఫ్యాట్ డైట్ పాటిస్తూ ప్రోబయాటిక్స్ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఇడ్లీ వంటి తేలికైన ఆహారాన్ని, పండ్లు, తృణధాన్యాలు, గింజలు ఫైబర్ అధికంగా ఉండే కొన్ని ఆహారాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతాయి.

నిమ్మకాయలో ఆహారాన్ని అరిగించే గుణం ఎక్కువగా ఉంటుంది. మీకు కడుపు ఉబ్బరంగా ఉంటే.. ఓ గ్లాసుడు నిమ్మరసం తాగండి. కాస్త ఉపశమనంగా అనిపిస్తుంది.


సోంపు నీరు కూడా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కాబట్టి, ఒక గ్లాస్ వాటర్‌లో ఒక స్పూన్ సోంపును వేసి 5 నిమిషాలు మరిగించి, గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగండి. ఇది అజీర్తి, ఎసిడిటీని దూరం చేస్తుంది.

ఆహారాన్ని జీర్ణం చేయడంలో జీలకర్ర కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇది మార్నింగ్ సిక్ నెస్‌ని, కడుపు నొప్పిని, విరేచనాలను దూరం చేయడంలో సహాయపడుతుంది. ఓ స్పూన్ జీలకర్ర నీరు తాగితే మంచి రిజల్ట్ కనిపిస్తుంది.

మరి ముఖ్యంగా హైడ్రేషన్ కోసం నీరు ఎక్కువగా తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఊపిరితిత్తులు ఎందుకు ఫెయిల్ అవుతాయి..?

## లక్షణాలు ఏమిటి..? ఏయే ఆహారాలను తీసుకోవాలి..?



మనం పీల్చే గాలిని శుద్ధి చేసి శరీర భాగాలకు అందించడంతోపాటు శరీర భాగాల్లో ఉత్పత్తి అయ్యే కార్బన్ డయాక్సైడ్ వంటి చెడు వాయువులను బయటకు పంపించడంలో, మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఊపిరితిత్తులు నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను సైతం ఎప్పటికప్పుడు బయటకు పంపిస్తాయి. అయితే పలు రకాల కారణాల వల్ల కొందరికి ఊపిరితిత్తులు చెడిపోవడం జరుగుతుంది. కిడ్నీలు ఫెయిల్ అయినట్లుగానే ఊపిరితిత్తులు కూడా కొందరికి ఫెయిల్ అవుతుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. శ్వాసనాళంలో ఏవైనా తీవ్రమైన అడ్డంకులు ఉంటే దీర్ఘకాలంలో అది ఊపిరితిత్తుల ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. అలాగే ఆస్తమా ఉన్నవారికి కూడా ఊపిరితిత్తులు ఫెయిల్ అయ్యే అవకాశాలు ఉంటాయి.

**కారణాలు..**

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ) అనే సమస్య ఉన్నవారికి, సిస్టిక్ ఫైబ్రోసిస్ అనే వ్యాధి ఉన్నా ఊపిరితిత్తులు ఫెయిల్ అవుతాయి. ఊపిరితిత్తుల కణజాలంలో సమస్యలు ఉన్నా, అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఏఆర్డీఎస్) అనే సమస్య ఉన్నవారిలో, న్యుమోనియా దీర్ఘకాలంగా ఉన్నా, పల్మనరీ ఫైబ్రోసిస్ అనే సమస్య ఉన్నవారికి కూడా లంగ్స్ ఫెయిల్ అవుతాయి. ఊపిరితిత్తుల్లో ఉండే రక్త నాళాల్లో రక్త సరఫరా సరిగ్గా జరగకపోయినా, ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ సరిగ్గా సరఫరా అవకపోయినా, పల్మనరీ ఎంబోలిజం అనే సమస్య ఉన్నవారిలో, గుండె జబ్బులు ఉన్నవారిలోనూ ఊపిరితిత్తులు చెడిపోయే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇక ఊపిరితిత్తులు ఫెయిల్ అయిన వారిలో పలు లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడం నిరంతరాయంగా ఇబ్బందిగా అనిపిస్తుంది. కొందరు వేగంగా శ్వాస తీసుకుంటారు.

**లక్షణాలు..**

ఊపిరితిత్తుల సమస్య ఉన్నా, అవి చెడిపోయినా కూడా కొందరిలో గుండె వేగంగా కొట్టుకుంటుంది. చర్మం, పెదవులు నీలి రంగులో మారి దర్శనమిస్తాయి. ఆందోళన, తలతిరగడం, విశ్రాంతి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవన్నీ ఊపిరితిత్తులు చెడిపోయాయి అని చెప్పేందుకు లక్షణాలుగా భావించవచ్చు. అయితే కొందరికి ఈ సమస్య ఉంటే తీవ్రమైన తలనొప్పి కూడా ఉంటుంది. నిద్రమత్తుతో ఉంటారు. ఇక ఊపిరితిత్తులు చెడిపోయిన వారు డాక్టర్ సలహా మేరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఆహారంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీని వల్ల ఊపిరితిత్తులను తిరిగి ఆరోగ్యంగా పనిచేసేలా చేయవచ్చు.

**తీసుకోవాల్సిన ఆహారాలు..**

ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. ఇవి వాపులను తగ్గిస్తాయి. ఊపిరితిత్తుల కణజాలం ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. బెర్రీలు, యాపిల్స్, ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు, టమాటాలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక వీటిని రోజూ తింటే ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అలాగే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే చేపలు, గింజలు, విత్తనాలు, మెగ్నిషియం అధికంగా ఉండే పాలకూర, అరటి పండ్లు, అవకాడో, నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, తర్బూజా వంటి పండ్లు, కోడిగుడ్డు పచ్చని సొన, తృణ ధాన్యాలు, కొబ్బరి నీళ్లు, హెర్బల్ టీలు లాంటి ఆహారాలన్నీ ఊపిరితిత్తులకు ఎంతో మేలు చేస్తాయి. ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు ఈ ఆహారాలను తింటుంటే మేలు జరుగుతుంది.

# డయాబెటిస్ ఉన్నవారు పనస పండ్లను తినవచ్చా..?

## అసలు ఈ పండ్లతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..?



పండ్లు అనగానే మనకు తియ్యని రుచి గుర్తుకు వస్తుంది. కానీ అన్ని రకాల పండ్లు తియ్యగా ఉండవు. కేవలం కొన్ని మాత్రమే తియ్యగా ఉంటాయి. అయినప్పటికీ పండు ఏదైనా సరే ఆరోగ్య ప్రయోజనాలనే అందిస్తుంది. అయితే తియ్యని పండ్లలో పనస పండ్లు కూడా ఒకటి. వీటి వాసన అతి తీపిగా ఉంటుంది. కనుక ఈ పండ్లను తినేందుకు కొందరు వెనుకాడుతుంటారు. కానీ పనస పండ్లను తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా పనస పండ్లను చాలా మంది తింటుంటారు. కొందరు ఈ పండ్లను చక్కెరకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగిస్తారు. ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. పనస పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**బరువు తగ్గేందుకు..**

పనస పండ్లలో అనేక రకాల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఈ పండ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. ఈ పండ్లలో విటమిన్ ఎ సమృద్ధిగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండ్లలో అధికంగా ఉండే పొటాషియం, మెగ్నిషియం, మాంగనీస్ మన శరీరంలో అనేక జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు దోహదం చేస్తాయి. పనస పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీని వల్ల ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**డయాబెటిస్ ఉంటే..**

పనస పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. ఈ పండ్లలో సమృద్ధిగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లతోపాటు ఫైబర్ వల్ల మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. పనస పండ్లలో ఉండే విటమిన్ సి వల్ల తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూస్తుంది. రోగాలు రాకుండా ఉంటాయి. పనస పండ్లు తియ్యగా ఉంటాయి. అయినప్పటికీ వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. పైగా ఫైబర్, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి కనుక ఈ పండ్లను తింటే షుగర్ లెవల్స్ పెరగవు. షుగర్ నియంత్రణలో ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా ఈ పండ్లను నిరభ్యంతరంగా తినవచ్చు.

**నాన్ వెజ్ తినని వారు..**

పనస పండ్లలో ఉండే ఫ్లేవనాయిడ్స్, లిగ్నన్స్ అనే సమ్మేళనాల కారణంగా ఈ పండ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటాయి. ఇవి శరీరంలోని తీవ్రమైన వాపులను సైతం తగ్గిస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి వీటిని చక్కని ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. పనస పండ్లతో కొందరు ఊరగాయ, చట్నీ, కూరలు కూడా చేస్తుంటారు. నాన్ వెజ్ తినని వారు ఇలా పండ్లను తింటున్నా కూడా మేలు జరుగుతుంది. దీని వల్ల ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి.

కండరాల నిర్మాణం జరుగుతుంది. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. పనస పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధికంగా ఉంటుంది కనుక ఈ పండ్లను తింటే చర్మం సురక్షితంగా ఉంటుంది. సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది. ఇలా పనస పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
6 అక్టోబర్
2025






# పాక్ పనిపట్టిన భారత మహిళల జట్టు

## దాయాదిపై జయభేరి
## రాణించిన క్రాంతి, హర్లీన్
## వన్డేల్లో పాకిస్థాన్‌పై 12వ విజయం




కొలంబో: అంతర్జాతీయ క్రికెట్‌లో వరుసగా నాలుగో ఆదివారం పాకిస్థాన్‌కు భారత్ చేతిలో భంగపాటు తప్పలేదు. ఇటీవలే ముగిసిన ఆసియా కప్‌లో భారత పురుషుల జట్టు మూడుసార్లూ పాకిస్థాన్ జట్టును చిత్తుచేయగా తాజాగా అమ్మాయిలూ ఆ విజయ పరంపరను కొనసాగించారు. మహిళల వన్డే ప్రపంచకప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థుల మధ్య కొలంబో వేదికగా జరిగిన పోరులో భారత్.. 88 పరుగుల తేడాతో గెలిచి జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉమెన్ ఇన్ బ్లూ.. బ్యాట్‌తో తడబాటుకు గురై నిర్ణీత ఓవర్లలో 247 పరుగులే చేయగలిగింది.

హర్లీన్ డియోల్ (46), రిచా ఘోష్ (35) ఫర్వాలేదనిపించారు. బ్యాట్‌తో విఫలమైనా బంతితో మెరిసిన భారత్.. పాక్‌ను 43 ఓవర్లలో 159కే కట్టడిచేసింది. క్రాంతి గౌడ్ (3/20) పదునైన పేస్‌కు తోడు దీప్తి శర్మ (3/45), స్నేహ్ రాణా (2/38) స్పిన్ మాయాజాలానికి దాయాది కుదేలైంది. సిద్ర అమిన్ (81) ఒంటరిపోరాటం చేసినా ఆ జట్టును గెలిపించలేకపోయింది. కాగా వన్డేల్లో పాక్‌పై భారత్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో ఇది 12వ విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లోనూ భారత్.. పాకిస్థాన్‌తో 'నో షేక్‌హ్యాండ్' విధానాన్ని కొనసాగించింది.

**పడుతూ లేస్తూ..**

మ్యాచ్ రిఫరీ షంద్రె ఫ్రిట్జ్ తప్పిదం వల్ల టాస్ భారత్ గెలిచినా పాక్ సారథి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియాకు మంచి ఆరంభమే దక్కింది. ఓపెనర్లు ప్రతీక రావల్ (31), స్మృతి మంధాన (23) 9 ఓవర్లకు 48 రన్స్ జోడించారు. కానీ స్మృతి నిష్క్రమించాక భారత బ్యాటింగ్ లైనప్ తడబడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (19) విఫలమైనా హర్లీన్, జెమీమా రోడ్రిగ్స్ (32) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరూ ఔట్ అవడంతో స్కోరువేగం మందగించింది. మధ్య ఓవర్లలో రిచాను కాదని స్నేహ్ రాణాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకుపంపినా దీప్తితో కలిసి ఆమె వేగంగా ఆడలేకపోయింది. ఆఖర్లో రిచా ఘోష్ ధనాధన్ మెరుపులతో భారత్ పోరాడగలిగే స్కోరును చేయగలిగింది. పాక్ బౌలర్లలో దయానా బేగ్ (4/69) నాలుగు వికెట్లు తీసింది.

**అమిన్ పోరాడినా..**

ఛేదనలో పాక్‌కు నాలుగో ఓవర్లోనే ఎదురుదెబ్బ తగిలింది. దీప్తి శర్మ వేసిన త్రోకు ఓపెనర్ మునీబా అలీ రనౌట్‌గా వెనుదిరిగింది. యువ సంచలనం క్రాంతి.. దాయాది జట్టుకు వరుస షాకులిచ్చింది. 8వ ఓవర్లో సదాఫ్ (6).. క్రాంతికే క్యాచ్ ఇచ్చి ఔట్ అవగా 12వ ఓవర్లో అలియా (2) దీప్తి చేతికి చిక్కింది. 10 ఓవర్లకు 25/2గా ఉన్న పాక్ 19వ ఓవర్లో 50 పరుగుల మార్కును అందుకుంది. సిద్ర, నటాలియా వికెట్లు ఇవ్వకూడదనే పట్టుదలతో మరీ నెమ్మదిగా ఆడారు.

నాలుగో వికెట్‌కు ఈ జోడీ 69 రన్స్ జోడించింది. అయితే 28వ ఓవర్లో మళ్లీ బంతినందుకున్న క్రాంతి.. నటాలియాను ఔట్ చేసింది. ఆమె స్థానంలో వచ్చిన ఫాతిమా (2)ను దీప్తి పెవిలియన్‌కు పంపింది. 30వ ఓవర్లో పాక్ స్కోరు వంద పరుగులు దాటింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండటంతో 81 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేసిన సిద్ర.. గేర్ మార్చి దూకుడుగా ఆడేందుకు యత్నించింది. కానీ మరో ఎండ్‌లో ఆమెకు అండగా నిలిచేవారే కరువయ్యారు. ఒకదశలో 143/5తో ఉన్న పాక్.. 159కు ఆలౌట్ అవడం గమనార్హం.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్: 50 ఓవర్లకు 247 (హర్లీన్ 46, రిచా 35, దయానా 4/69, ఫాతిమా 2/38)బీ

పాకిస్థాన్: 43 ఓవర్లలో 159 (అమిన్ 81, నటాలియా 33, క్రాంతి 3/20, దీప్తి 3/45)

# చివరిరోజు 4 పతకాలు

## ప్రపంచ పారా అథ్లెటిక్స్
## సిమ్రన్, ప్రీతి, నవ్‌దీపకు రజతాలు
## మొత్తంగా భారత్ ఖాతాలో 22 మెడల్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్స్‌షిప్స్‌ను భారత్ ఘనంగా ముగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 22 పతకాలు (6 స్వర్ణ, 9 రజత, 7 కాంస్య) సాధించి పదో స్థానంలో నిలిచింది. పోటీలకు చివరి రోజైన ఆదివారం మరో మూడు రజతాలు, కాంస్యం భారత్ ఖాతాలో చేరాయి. సిమ్రన్ శర్మ, ప్రీతి పాల్ చాంపియన్‌షిప్స్‌లో రెండో పతకాన్ని సొంతం చేసుకొన్నారు. మహిళల 200 మీటర్ల టీ12 ఫైనల్లో సిమ్రన్ 24.46 సెకన్ల టైమింగ్‌తో రజతం సాధించింది. ఇప్పటికే 100 మీ. టీ12 కేటగిరీలో సిమ్రన్ స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక, మహిళల 100 మీటర్ల టీ35 ఫైనల్లో 14.33 సెకన్లలో రేస్ పూర్తి చేసిన ప్రీతి రజతం దక్కించుకొంది. ఇదివరకే 200 మీ. టీ35 రేస్‌లో పాల్ కాంస్యం సాధించింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 కేటగిరీలో 45.46 మీటర్ల దూరం విసిరిన నవ్‌దీప్ రెండో స్థానంతో రజతం అందుకొన్నాడు. పురుషుల 200 మీటర్ల టీ44 విభాగంలో సందీప్ 23.60 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం సాధించాడు. బ్రెజిల్ 44 (15 స్వర్ణ, 20 రజత, 9 కాంస్య) పతకాలతో టాప్‌లో నిలవగా.. చైనా 52 (13-22-17), ఇరాన్ 16 (9-2-5) మెడల్స్‌తో రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి.







# ప్రభ్‌సిమ్రాన్ సెంచరీ

## మూడో వన్డేలో ఆసీస్ 'ఎ' పరాజయం
## సిరీస్ భారత్ 'ఎ' వశం



కాన్పూర్: ఆస్ట్రేలియా 'ఎ'తో మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీసను భారత్ 'ఎ' 2-1తో దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ ఉత్కంఠ భరితంగా జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 'ఎ' రెండు వికెట్లతో నెగ్గింది. తొలుత ఆస్ట్రేలియా 'ఎ' 49.1 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. ఎడ్వర్డ్స్ (89), స్కాట్ (73), కొనొలీ (64) అర్ధ శతకాలు సాధించారు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడేసి, బదోని రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 'ఎ' 46 ఓవర్లలో 322/8 స్కోరు చేసి గెలుపొందింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (102) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయాస్ (62), పరాగ్ (62) హాఫ్ సెంచరీలో సత్తా చాటారు. చివర్లో వరుస వికెట్లు కోల్పోయి భారత్ 'ఎ' ఇబ్బందులో పడినా అర్ష్‌దీప్ (7 బ్యాటింగ్) అండగా విప్రాజ్ నిగమ్ (24 నాటౌట్) జట్టును విజయ తీరాలకు చేర్చాడు. టాడ్ మర్ఫీ, తన్వీర్ సంఘా చెరో 4 వికెట్లు తీశారు.

# ఇరానీ విజేత విదర్భ




నాగ్‌పూర్: ఇరానీ కప్‌ను విదర్భ గెలుచుకుంది. ఇక్కడ ముగిసిన ఐదు రోజుల మ్యాచ్‌లో 93 పరుగులతో రెస్టాఫ్ ఇండియా ఓడించింది. 361 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 30/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్ట్ 267 రన్స్‌కు ఆలౌటైంది. యశ్ ధుల్ (92), మానవ్ సుతార్ (56 నాటౌట్) పోరాడినా 'రెస్ట్'కు ఓటమి తప్పలేదు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 104 రన్స్ జోడించారు.

సంక్షిప్తస్కోర్లు: విదర్భ: 342, 232బీ రెస్టాఫ్ ఇండియా: 214, 267 (ధుల్ 92, మానవ్ 56 నాటౌట్, ఇషాన్ 35, హర్ష్ దూబే 4/73, ఆదిత్య ఠాక్రే 2/27, యశ్ ఠాకూర్ 2/47).

**యశ్-ధుల్ కొట్టుకోబోయారు!**

ఆఖరిరోజు ఆటలో విదర్భ పేసర్ యశ్ ఠాకూర్, రెస్ట్ బ్యాటర్ యశ్ ధుల్ కొట్టుకున్నంత పని చేశారు. ఠాకూర్ వేసిన షార్ట్‌పిచ్ బంతికి ధుల్ క్యాచవుటయ్యాడు. కీలకమైన వికెట్ పడగొట్టిన నేపథ్యంలో ఠాకూర్ తీవ్రంగా స్పందించాడు. అది జీర్ణించుకోలేని ధుల్..ఠాకూర్‌పై దాడి చేసేందుకు అతడివైపు దూసుకు పోయాడు. ఠాకూర్ కూడా తగ్గేదిలేన్నట్టుగా జవాబివ్వడంతో ఇద్దరూ కొట్టుకొనేదాకా వెళ్లారు. అయితే అంపైర్లు కలుగజేసుకొని వారిని విడదీశారు.



## హృదయాలు దోచేస్తున్న రాములమ్మ!

శ్రీముఖి అలియాస్ బుల్లితెర రాములమ్మగా పేరు సొంతం చేసుకుంది. ఈ మధ్యకాలంలో బుల్లితెర మహారాణిగా పేరుపొందిన యాంకర్ సుమా రేంజ్ లో అవకాశాలు అందుకుంటూ ఇటు పలు బుల్లితెర షోలకు హోస్ట్ గా వ్యవహరిస్తూనే.. అటు సినిమా ఈవెంట్లలో కూడా సందడి చేస్తోంది. ముఖ్యంగా కట్టుబొట్టుతో అందరినీ ఆకట్టుకునే ఈమె.. ఇటు సాంప్రదాయంగా కనిపించడమే కాకుండా.. అటు గ్లామర్ ఒలకబోస్తూ ప్రేక్షకులను కూడా అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇప్పుడు తాజాగా మరో అవుట్ ఫిట్ తో ఆడియన్స్ ను అలరించడానికి మరో ఫోటోషూట్ తో ఫాలోవర్స్ ముందుకు వచ్చేసింది శ్రీముఖి.

తాజాగా పర్పుల్ కలర్ లెహంగా ధరించిన ఈమె ఇందులో చూడ చక్కని లుక్కులో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ మధ్య శ్రీముఖిని సాంప్రదాయంగా చూసేసరికి అభిమానులు, ఫాలోవర్స్ కూడా తెగ సంబరపడిపోతున్నారు. తాజాగా పర్పుల్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్లో మల్టీకలర్ థ్రెడ్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ ధరించింది. ఈ ఔట్ఫిట్ ను పరిపూర్ణం చేయడం కోసం గోల్డెన్ కలర్ లేస్ తో డిజైన్ చేసిన పర్పుల్ కలర్ దుపట్టాతో అందాలను దాచేసింది. పైగా అందమైన గాజులు, చెవి దుద్దులతో పాటు ఆ నెక్ ను మరో హారంతో అందంగా తీర్చిదిద్దింది. అలా మొత్తానికైతే సింపుల్ లుక్ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసిన ఈమె.. అందరి దృష్టిని ఆకర్షిస్తుందని చెప్పవచ్చు. ప్రస్తుతం శ్రీముఖికి సంబంధించిన ఈ ఔట్ఫిట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది.



## బాలీవుడ్ పై రాశీ ఖన్నా సంచలన కామెంట్స్

టాలీవుడ్ లో సినిమాలు చేసే హీరోయిన్లకు గౌరవం ఎక్కువగా ఉంటుందని హీరోయిన్ రాశీ ఖన్నా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో నటీనటుల మధ్య చాలా మంచి ఫ్రెండ్షిప్, బెస్ట్ అట్మాస్ఫియర్ ఉంటుందని, మరీ ముఖ్యంగా ఇక్కడ హీరోయిన్లకు చాలా రెస్పెక్ట్ ఇస్తారని, టాలీవుడ్ లో వర్క్ చేస్తుంటే ఎప్పుడూ ఒక ఫ్యామిలీలో ఉన్నట్టే అనిపిస్తుందని రాశీ ఖన్నా చెప్పారు.

టాలీవుడ్ లో వర్కింగ్ అవర్స్ చాలా క్రమబద్ధంగా ఉంటాయని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే కాల్షీట్స్ ఉంటాయని, బాలీవుడ్, తమిళ ఇండస్ట్రీలో ఒక్కో కాల్షీట్ 12 గంటలు ఉంటుందని, అందుకే ఎక్కువగా అలసిపోతామని, పైగా తెలుగు ఆడియన్స్ తనపై ఎక్కువ అభిమానం చూపిస్తూ ఉంటారని, తాను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా తెలుగు ఫ్యాన్స్ ఆదరిస్తారని ఆమె పేర్కొన్నారు. సౌత్ లో దొరికినట్టు నార్త్ లో రెస్పెక్ట్ దొరకదని, బాలీవుడ్ లోని నటీనటులు ఆడంబరంగా ప్రవర్తిస్తారని, సౌత్ ఇండస్ట్రీని చూసి నార్త్ లోని కొంతమంది నేర్చుకోవాలని రాశీ చెప్పడంతో ఆ కామెంట్స్ సోషల్ మీడియాలో చర్చకు దారి తీశాయి. నార్త్ లో ఎక్కువ సినీ అవకాశాలు రాకపోవడంతో ఇలా ఇష్టమొచ్చినట్టు కామెంట్స్ చేయడం సరికాదని రాశీని కొందరు తప్పుబడుతున్నారు. కానీ మరికొందరు మాత్రం తన అభిప్రాయం తాను చెప్పింది ఇందులో తప్పేముందని రాశీని వెనుకేసుకొస్తున్నారు. అయితే రాశీ మాత్రం తన అనుభవాన్ని మాత్రమే చెప్పానని చెప్తున్నారు. చాలా రోజుల తర్వాత రాశీ ఖన్నా తెలుగులో సిద్దూ జొన్నలగడ్డ తో కలిసి తెలుసు కదా అనే సినిమా చేయగా, ఆ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుసు కదా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న రాశీ ఓ ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. ఈ సినిమా హిట్టైతే టాలీవుడ్ నుంచి మరిన్ని అవకాశాలొస్తాయని రాశీ తెలుసు కదాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

## సాయి పల్లవి.. జస్ట్ ఒక అడుగు దూరంలో..

స్టార్ హీరోయిన్ సాయి పల్లవి.. ఆమెకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు మించిన క్రేజ్ సొంతం చేసుకున్న అమ్మడు.. తన నేచురల్ లుక్, సహజ నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. తనకంటూ ఇప్పటికే ప్రత్యేక ఇమేజ్ ను సృష్టించుకున్నారు. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ కంటెంట్, ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటున్న సాయి పల్లవి.. ఇప్పుడు సౌత్ లో అత్యధిక డిమాండ్ ఉన్న హీరోయిన్ అనే చెప్పాలి. రీసెంట్ గా తండేల్ మూవీతో భారీ హిట్ ను అందుకున్న బ్యూటీ.. ఇప్పుడు బాలీవుడ్ లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న రామాయణ్ లో నటిస్తున్నారు. సినిమాలో సీతమ్మగా కనిపించనున్న ఆమె లుక్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. ఆ మూవీతో మరిన్ని చిత్రాలను లైన్ లో పెడుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఇప్పుడు రామాయణ్ సినిమాకు గాను సాయి పల్లవి భారీగా రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్టు సమాచారం. రూ.20 కోట్ల పారితోషికం అందుకుంటున్నారట. అంతే కాదు.. తాను నటించబోయే తర్వాత ప్రాజెక్టులకు దాదాపు రూ.13 కోట్ల వరకు అందుకోనున్నారని సమాచారం. అయితే ఇప్పుడు అత్యధిక పారితోషికం అందుకునే సౌత్ హీరోయిన్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచినట్లు తెలుస్తోంది. మరో స్టార్ హీరోయిన్ నయనతార భారీ రెమ్యునరేషన్ అందుకుంటూ టాప్ లో ఉంది. ఆమె ఒక్కో సినిమాకు రూ.15 కోట్లు పైగా అందుకుంటున్నారని సమాచారం. దీంతో ఆమె హైయెస్ట్ పారితోషికం అందుకున్న సౌత్ బ్యూటీల లిస్ట్ లో టాప్ ప్లేస్ లో ఉండగా, సాయి పల్లవి రెండో స్థానంలో ఉంది. ఈ మేరకు ఓ జాతీయ మీడియా ఆ వివరాలను ప్రకటించింది. దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే సాయి పల్లవికి ఇప్పటికే మంచి క్రేజ్ ఉండగా.. దాన్ని ఇంకా పెంచుకుంటూ పోతున్నారు. ఇప్పుడు రామాయణ్ పాన్ ఇండియా రేంజ్ లో హిట్ అయితే.. సాయి పల్లవి క్రేజ్ ఆకాశాన్ని తాకుతుంది. అప్పుడు ఆమె రెమ్యునరేషన్ కూడా పెరుగుతుంది. అలా సౌత్ లో హైయెస్ట్ రెమ్యునరేషన్ అందుకునే హీరోయిన్ గా నిలిచే అవకాశం ఎంతైనా ఉంది. ఇప్పుడు టాప్ ప్లేస్ కు జస్ట్ అడుగు దూరంలో ఉన్నారు సాయి పల్లవి.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986